ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర,డిసెంబర్ 19 : మండల కేంద్రంతోపాటు, బట్టు గూడెం గ్రామం లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. సర్వేను అధికారులు వేగవంతం చేయాలని, దరఖాస్తుల పరిశీల నలో సమస్యలు ఏర్పడితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్‌కు తెలుపాలని సూచించారు. సర్వే సందర్భంగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసిన వారితో మాట్లాడి అప్‌లోడ్ చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. హౌసింగ్ పీడీ రాజ కుమార్, ఎంపీడీఓ ఉమాదేవి ఉన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : పీఏపల్లి పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం అంగడిపేటలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ చంద్రమౌళి, వైద్యాధికారి రంజిత్‌కుమార్ ఉన్నారు.

ఐటీ టవర్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ

● ఐటీ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా

ఐటీ టవర్‌ను పరిశీలిస్తున్న భవేశ్ మిశ్రా

నల్లగొండ, డిసెంబర్ 19: నల్లగొండ ఐటీ టవర్ ద్వారా ఉద్యోగులకు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యునికేషన్స్ డిప్యూటీ సెక్రటరీ, భవేశ్ మిశ్రా తెలిపారు. గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఐటీ టవర్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఐటీ టవర్ నిర్మాణ పరంగా బాగా ఉన్నందున ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు ఏఐపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ఉద్యోగులను గుర్తించటంతో పాటు 20 బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇవ్వాలన్నారు. 500 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో జపాన్‌కు చెందిన ఒక కంపెనీ తన కార్యకలాపాలు నిర్వహించనున్నదని, టవర్‌లో ఆర్టిఫిషల్ ఇంటెలిజన్స్ పరికరాలు సైతం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వారి వెంట ఇండస్ట్రీస్ జీఎం కోటేశ్వర్‌రావు, ఐటీ టవర్ మేనేజర్ నాగరాజు, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్ ఉన్నారు.

సైబర్ నేరాల దర్యాప్తులో బ్యాంకర్లు సహకరించాలి

● ఎస్పీ శరత్ చంద్ర పవార్


మాట్లాడుతున్న ఎస్పీ

నీలగిరి, డిసెంబర్19 : ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడి నష్టపోయినప్పుడు వారికి సత్వర న్యాయం అందించడంలో బ్యాంకర్లదే కీలకపాత్ర అని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. సైబర్ నేరాల నివారణ, బ్యాంకర్ల పాత్ర, బ్యాంకుల వద్ద భద్రతా చర్యలపై గురువారం ఎస్పీ కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగి క్యాష్‌లెస్ లావాదేవిలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో సైబర్ నేరాలూ పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి నేరాల దర్యాప్తులో బ్యాంక్ సిబ్బంది అధికారులకు సహకరించాలన్నారు. కోర్టు అనుమతితో సైబర్ బాధితులకు అందాల్సిన డబ్బును అకౌంట్ నందు క్రెడిట్ చేసి అకౌంట్‌ను ఆన్ ఫ్రీజింగ్ చేసి బాధితులకు అండగా నిలవాలని కోరారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని లేదా www. cybercrime. gov.in ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్బీ డీఎస్పీ రమేశ్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సైబర్‌క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్బీ రాఘవరావు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ/మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 19: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదేశించారు. గురువారం పట్టణంలోని బకల్‌వాడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలని, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, రాంరెడ్డితో కలిసి టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందించారు. అనంతరం మండలంలోని గూడూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంపీఓ రమేష్, ఎంఈఓ బాలూనాయక్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మిర్యాలగూడ, డిసెంబర్ 19: మిర్యాలగూడ పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన సిరికొండ భానుప్రకాశ్ కొంత కాలంగా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఉంటూ గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఉదయం 10 గంటల సమయంలో పట్టణంలోని బోటింగ్‌పార్క్ శివాలయం వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. చేతి సంచితో పారిపోతున్న భానుప్రకాశ్‌ను వెంబడించి పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా చెడు వ్యసనాలకు బానిసగా మారి కోదాడకు చెందిన అఖిల్, డేంజర్ రాఘవతో కలిసి 2023 నుంచి హైదరాబాద్‌తో పాటు మిర్యాలగూడలో గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. నవంబర్‌లో భద్రాచలం మీదుగా కుర్మనూరుకు వెళ్లి 2.5 కేజీల గంజాయి కొనుగోలు చేశాడు. 1200 గ్రాములను అమీనాబాద్‌లోని తన ఇంట్లో ఉంచుకున్నాడు. మిగతా గంజాయిని ప్యాకెట్లుగా మార్చి హైద్రాబాద్‌లో పలు చోట్ల విక్రయించాడు. మిగిలిన గంజాయిని మిర్యాలగూడలో విక్రయించేందుకు తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 1.3 కేజీల గంజాయి, మొబైల్, రూ.2400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టులో రిమాండ్ చేశామని ఔ, మిగతా ఇద్దరు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. సీఐలు నాగార్జున, కరుణాకర్, ఎస్ఐ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

బియ్యం వ్యాపారి అరెస్ట్

అడవిదేవులపల్లి, డిసెంబర్ 19: పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యాపారిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. త్రిపురారం మండలం సీత్యాతండాకు చెందిన ధనావత్ జైపాల్ 6క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మాటూరు నుంచి ఆటోలో ఆంధ్రప్రదేశ్‌లోని దాచేపల్లికి తరలిస్తుండగా ఉల్సాయిపాలెం వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ వి.శేఖర్ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగ అవకాశం

★ మిర్యాలగూడ పరిసర ప్రాంతంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలో పనిచేయుటకు MBA పూర్తి చేసిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర : 9396610312

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

ప్రశ్నించే వారి గొంతునొక్కుతున్న ప్రభుత్వం

● హామీల అమలులో సర్కారు విఫలం
● జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం

మునుగోడు పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న గొల్లకురమ సంఘం నాయకులు

మునుగోడు, డిసెంబర్19 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రెండో విడుత గొర్రెల పంపిణీ ద్వారా గొల్లకురుమలకు రూ.2లక్షల నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాగర్ల మల్లేశం అన్నారు. గురువారం ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ఆయనతో పాటు పలువురిని ముందుస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోనే వారు నిరస తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కడం దారుణమన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో యాసరాణి శ్రీను, వేముల లింగస్వామి, వంటెపాక అయోధ్య, రమేశ్, ఎన్.మహేశ్, మహేందర్ ఉన్నారు.

గొల్లకురుమల ముందస్తు అరెస్ట్

త్రిపురారం : గొల్ల కురుమలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు వెళ్తున్న గొల్లకురుమ నాయకులను గురువారం ఉదయం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షుడు చింతకాయల యాదయ్య మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని అడగడం కూడా నేరమేనా అని ప్రశ్నించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో నాయకులు జంగిలి శ్రీనివాస్, రామలింగయ్య, సైదులు ఉన్నారు.

మార్చి 21నుంచి టెన్త్ పరీక్షలు

రామగిరి, డిసెంబర్ 19: పదవ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21, 2025 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగుతాయని డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు పరీక్షల టైం టెబుల్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అన్ని పాఠశాలల యాజమన్యాలు విద్యార్థులకు సమాచారం అందించాలని, సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలు సిద్ధం చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ

నకిరేకల్, డిసెంబర్ 19 : మండలంలోని ఆర్లగడ్డగూడెం, మర్రూర్, చందుపట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సాయిగణేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ తీగలకు అనుకున్న చెట్ల కొమ్మలను తొలగించడం, లైన్ ఏబీ స్విచ్‌ల రిపేరు నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

22న అండర్-19 చెస్ పోటీలు

మిర్యాలగూడటౌన్, డిసెంబర్19: ఈ నెల 22న డైమండ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అండర్-19 ఉమ్మడి జిల్లా చెస్ టోర్నమెంట్ మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు మాశెట్టి దివ్య తెలిపారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో టోర్నమెంట్ పోస్టర్‌ను మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాశెట్టి శ్రీనివాస్, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకుల హాస్టల్లో విద్యార్థుల మధ్య ఘర్షణ

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్19 : మండలంలోని అవంతీపురం గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం రాత్రి విద్యార్థులు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పాఠశాల టెన్త్ క్లాస్ విద్యార్థులు ముగ్గురు హాస్టల్ రూంలో ఘర్షణ పడగా ఒక విద్యార్థి తలకు గాయమైనట్లు తెలిసింది. పాఠశాల ఏఎన్ఎం ప్రథమ చికిత్స చేసింది. గురువారం ఉదయం సదరు విద్యార్థి తల్లి దండ్రులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు వచ్చి ఆందోళన చేయడంతో గాయపడిన విద్యార్థికి మిర్యాలగూడ పట్టణంలో వైద్యం చేయించినట్లు సమాచారం. దాడి చేసిన విద్యార్థిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రెండు రోజులు ఇంటికి పంపించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌ను వివరణ కోరగా తాను సెవులో ఉన్నానని తెలిపారు.

ఆర్‌పీల సమస్యలను పరిష్కరించాలని వినతి

మిర్యాలగూడ, డిసెంబర్ 13: మున్సిపాలిటీలోని మెప్మాలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌పీలు గురువారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జాజుల చంద్రకళ, ధూళిపాళ కళావతి, ఎస్‌కే.షాజహా, కె.రజిత, ఎన్.సరితలు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు

రామగిరి, డిసెంబర్ 19: రెండు సంవత్సరాల ఐటీఐ(ఎన్‌సీవీటీ ఇంజినీరింగ్) కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్ కల్పిస్తున్నట్లు నల్లగొండ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జంజిరాల వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30లోగా ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

లచ్చిరాంకు నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా పుస్తకాలు

మర్రిగూడ, డిసెంబర్ 19 : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంకు గురువారం నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా వారు రూ.10వేల విలువ చేసే పుస్తకాలను పోస్ట్ ద్వారా పంపించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తున్న చేసుకున్న లచ్చిరాం ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రం నుంచి నేషనల్ జ్యూరీకి ఎంపికయ్యారు. నేషనల్ జ్యూరీకి ఎంపికైన వివిధ రాష్ట్రాల ఉపాధ్యాయులకు నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియాలో శాశ్వత సభ్యత్వం కల్పిస్తూ పుస్తకాలను అందిస్తున్నారు. మన రాష్ట్రం నుంచి ఆరుగురు ఎంపిక కాగా ఉమ్మడి నల్లగొండ నుంచి లచ్చిరాం ఒక్కరే ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు వచ్చిన పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలలో ఉంచుతానని పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి నిధులు పెంచాలి

● బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ

సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న చాడ కిషన్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబర్ 19: ఆపదలో ఉన్న ప్రతి పేదవాడికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయానికి నిధులు పెంచాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. పలువురు బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.8.67లక్షల చెక్కులను గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బాధిత కుటుంబాలకు అందించారు. పేద ప్రజలు అనారోగ్యం బారిన పడిన సందర్భాల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం కోసం అప్పుల పాలవుతున్నారని, వారి ఆస్పత్రి ఖర్చులో కనీసం 75 శాతమైనా సీఎం సహాయనిధి ద్వారా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కే లతీఫ్, ముక్కామల్ల వెంకన్న, నారి నర్సింహ, అలుగుబెల్లి సైదిరెడ్డి, కర్నాటి మల్లేశ్, కంచర్ల శ్రవణ్‌గౌడ్ పాల్గొన్నారు.

సాగు నీటిని వృథా చేయవద్దు : ఐబీ సీఈ అజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఐబీ సీఈ

నల్లగొండ, డిసెంబర్ 19: ఏఎమ్మార్పీ కింద హైలెవల్‌తో పాటు లోలెవల్ కాల్వలకు 120 రోజుల పాటు యాసంగి సాగుకు ఈ నెల 15 నుంచి నీటిని విడుదల చేస్తున్నామని, రైతులు సాగు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని నీటిపారుదల శాఖ సీఈ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి పంటలు పూర్తయ్యే వరకు(వచ్చే ఏడాది ఏప్రిల్13 వరకు) రెగ్యులర్‌గా 600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తంగా హైలెవల్ కింద 2.20 లక్షల ఎకరాలు, లోలెవల్ కింద 80 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. కాల్వ కింద ప్రతి ఎకరాకు నీరందిస్తామని, రైతులు అక్రమంగా గండ్లు పెట్టి నీటిని వృథా చేయవద్దని సూచించారు. 55 డిస్ట్రిబ్యూటరీలకు సాగు నీరు ఇస్తున్నామని, డివిజన్ల వారీగా వారబందీ పద్ధతిలో రెగ్యులర్‌గా 600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఐబీ యంత్రాంగం ఎప్పటికప్పుడు కాల్వల మీద పర్యవేక్షణ చేస్తారని, కాల్వలకు అక్రమంగా గండ్లు పెడితే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు.

పారిశుధ్య కార్మికులపై కాంట్రాక్టర్ వేధింపులు

విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టిన ప్రభుత్వాసుపత్రి కార్మికులు

నీలగిరి, డిసెంబర్19 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులను కాంట్రాక్టర్ వేధింపులకు గురిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఎంసీహెచ్ వార్డుల్లో పనులు చేస్తున్న కార్మికులను వేరే భవనానికి సంబంధించిన సూపర్‌వైజర్ ఫొటోలు తీశాడు. రాత్రి సమయంలో ఎందుకు ఫొటోలు తీస్తున్నావని కార్మికులు ప్రశ్నించారు. సదరు సూపర్‌వైజర్ సమాచారంతో ఆస్పత్రికి వచ్చిన కాంట్రాక్టర్ మహిళా కార్మికుల వెయిటింగ్ రూంకు వెళ్లి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కార్మికులను దుర్భాషలాడడంతో పాటు సబిత అనే కార్మికురాలిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పాడు. దాంతో సదరు కార్మికురాలు తీవ్ర మనోవేదనకు గురై కింద పడిపోగా మిగతా కార్మికులు ఆమెను చికిత్స కోసం అదే ఆస్పత్రిలో చేర్పించారు. ఉదయం విధులకు వచ్చిన మిగతా కార్మికులు విషయం తెలుసుకొని కాంట్రాక్టర్ వేధింపులకు నిరసనగా విధులను బహిష్కరించి మెయిన్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. కాంట్రాక్టర్ అర్ధరాత్రి వచ్చి వేధింపులకు గురిచేస్తున్నాడని, తాగివచ్చి ఇష్టనుసారంగా మాట్లాడుతాడని కార్మికులు ఆరోపించారు. వెంటనే అతడి కాంట్రాక్టును రద్దు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి కార్మికులను పిలిచి మాట్లాడి ఆందోళన విరమించాలని కోరారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేంత వరకు తాము ఆందోళన విరమించేది లేదని కార్మికులు భీష్మించారు. దాంతో కాం ట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి వెంటనే సం జాయిషీ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దాంతో కార్మికులు ఆందోళన విరమించి విధులకు హాజరైయారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా ఏపీజీవీబీ

● బ్యాంక్ ఆర్ఎమ్ విజయ్‌భాస్కర్‌గౌడ్

నల్లగొండ, డిసెంబర్19: ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను జనవరి ఒకటో తేదీ నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మార్చనున్నట్లు బ్యాక్ ఆర్ఎమ్ విజయ్ భాస్కర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంక్ సేవలు నిలిచి పోతాయని, తిరిగి జనవరి ఒకటో తేదీ నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పేరుతో లావాదేవీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బ్యాంకులో ఖాతాలు కలిగిన వారు ఈ నెల 27 వరకు అత్యసవర బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఖాతాదారుల బ్యాంక్ ఖాతా నంబర్లు మారవని, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మాత్రం మారుతుందని తెలిపారు. ఏటీఎం కార్డులు, మొబైల్ బ్యాంకింగ్ సేవలు కొత్తగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆరు కొత్త పంచాయతీల ఏర్పాటుకు కసరత్తు.!

నిడమనూరు, డిసెంబర్ 19 : మండలంలో మరో ఆరు కొత్త పంచాయతీల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండలంలోని గోవిందన్నగూడెం, జంగాలవారి గూడెం, మార్తివారి గూడెం, రాంనగర్ తండా, గగ్గెనపల్లివారి గూడెం, కుంటిగొర్ల గూడెం గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరుతూ సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ఇటీల ప్రభుత్వానికి ప్రతిపాదన చేశారు. ఈ మేరకు అధికారులు ఆయా పంచాయతీలకు సంబంధించిన సమగ్ర వివరాలపై నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 500 జనాభా కలిగిన గ్రామాలను పంచాయతీలుగా ప్రకటించడంతో మండలంలో 9 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటైన విషయం విదితమే. ప్రస్తుతం మరో ఆరు గ్రామపంచాయతీల సిఫార్సును ప్రభుత్వం ఆమోదిస్తే మండలంలో పంచాయతీల సంఖ్య పెరుగనున్నది.

మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీకి దరఖాస్తులు

నల్లగొండ, డిసెంబర్ 19: తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు ఇవ్వనున్న నేపథ్యంలో అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీ మహిళలు TGOBMMS WEB PORTAL.. tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొని హార్డ్ కాపీని కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు. నిరుద్యోగ, ఒంటరి, అనాథ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

సీపీఐ వంద వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయాలి

పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

మునుగోడు, డిసెంబర్19 : సీపీఐ వంద వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల ప్రారంభ సందర్భంగా నల్లగొండ ఎన్జీకళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, బొల్గూరి నరిసింహ, తీర్పారీ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీను నాయకులు పాల్గొన్నారు.

మాలమహానాడు నేతల ముందస్తు అరెస్టు

● చలో అసెంబ్లీకి వెళ్లకుండా నిర్బంధం

మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో మాలమహానాడు నాయకులు

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్19(నమస్తే తెలంగాణ) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలివెళ్తున్న మాల మహానాడు నాయకులు, కార్యకర్తలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజాము నుంచే చలో అసెంబ్లీకి వెళ్లడానికి సిద్ధమవుతున్న వారందరినీ మండలాల వారీగా పోలీసులు నిర్బంధించారు. మధ్యాహ్నం వరకు పోలీస్ స్టేషన్లలోనే ఉంచి అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర కమిటీ చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా, పోలీసులు బుధవారం రాత్రి నుంచే నిఘా వేసి ఆ సంఘం నేతల కదలికను గుర్తిస్తూ ముందస్తు అరెస్టులకు తెరలేపారు. మండలాల వారీగా ముఖ్య నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. కట్టంగూరు, మునుగోడు, త్రిపురారం, నార్కట్‌పల్లి, దామరచర్ల, మాడ్గులపల్లి, మట్టంపల్లి, అర్వపల్లి, పెన్‌పహాడ్, హుజూర్‌నగర్, నేరడుచర్ల, నాగారం, మేళ్లచెర్వు తదితర మండలాల్లో పోలీసులు మాలమహానాడు నేతలను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టులను మాల మహానాడు నేతలు తీవ్రంగా ఖండించారు.

కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రామగిరి, డిసెంబర్ 19: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను కించపర్చే విధంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో మాట్లాడడాన్ని నిరసిస్తూ కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ అమిత్ షా మనువాద భావజాలంతో అంబేద్కర్‌ని అవమానించేలా మాట్లాడడం దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపర్చడమే అన్నారు. ఆయన తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున, తెలంగాణ విద్యా వంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి భిక్షమయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్ పాల్గొన్నారు.

హాలియా : కేవీపీఎస్ ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, నాయకులు దైద శ్రీను, దుబ్బ రాంచంద్రయ్య, కోరే రమేశ్, కారంపూడి ధనమ్మ, నాగార్జున పాల్గొన్నారు.

28 నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

నార్కట్‌పల్లి, డిసెంబర్ 19 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆరవ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో సభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు డి. రాములు, రాష్ట్ర సభ్యురాలు అరుణ, మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆదినారాయణ, ప్రతాప్‌రెడ్డి పాలొన్నారు.

తిరుమలగిరి(సాగర్) : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సంఘం జిల్లా కోశాధికారి వడిత్య రాజు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఎంఈఓ కొనమంచలి శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు ఎరనాగుల సైదులు, రేవల్లి రాజేష్, శైలజ, జ్వాలా నరసింహారావు, అమృతయ్య పాల్గొన్నారు.

చిట్యాల : స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో సంఘం మండల అధ్యక్షుడు ఏశమల్ల నాగయ్య మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు సతీశ్, రామలింగయ్య, జానకి, చంద్రశేఖర్, యాదయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్)లో పోస్టర్ ఆవిష్కరించారు. సంఘం జిల్లా కోశాధికారి వడిత్య రాజు, మండల అధ్యక్షుడు ఎరనాగుల సైదులు, నాయకులు పాల్గొన్నారు.

మా చదువులు సాగేదెట్లా

● కస్తూర్బా విద్యార్థినుల ఆందోళన

హాలియాలో ధర్నా చేస్తున్న విద్యార్థినులు

హాలియా/త్రిపురారం/చందంపేట/కట్టంగూర్, డిసెంబర్ 19 : చదువులు చెప్పే ఉపాధ్యాయులంతా సమ్మె చేస్తుంటే మా పరిస్థితి ఏమిటని కస్తూర్బాగాంధీ బాలకల పాఠశాల విద్యార్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం హాలిచా, త్రిపురారం, దేవరకొండ, కట్టం గూర్‌లోని కేజీబీవీ ఆవరణలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ అధ్యక్షుడు కోరె రమేశ్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మిన్నకుంటున్నదని, దాంతో పిల్లలు తమ సమయాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారితో చర్చలు జరిపి సమ్మె విరమింపజేయాలనికోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉద్యోగులతో పాటు ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు నల్లవెల్లి జగదీశ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్-4 అభ్యర్థులకు పోస్టింగ్స్

నల్లగొండ, డిసెంబర్ 19: గ్రూప్-4లో రెవెన్యూ విభాగంలో ఎంపికైన 55 మందికి కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ఏఓ మోతీలాల్ గురువారం జిల్లాలో జూనియర్ అసిస్టెంట్లుగా పోస్టింగ్స్ ఇచ్చారు. 2022లో గ్రూప్-4కు సంబంధించి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా ఈ ఏడాది నవంబర్-14న ఫలితాలు విడుదల చేశారు. 19న సర్టిఫికేషన్ వెరిఫికేషన్ అనంతరం డిసెంబర్-3న పెద్దపల్లిలో ముఖ్యమంత్రి వారికి ఆర్డర్స్ ఇచ్చారు. ఈ ఆర్డర్స్ ఆధారంగా జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో వారికి పోస్టింగ్‌లు కేటాయించి ఆర్డర్ కాపీలు అందించారు.


పోస్టింగ్స్ అందుకున్న వారితో కలెక్టరేట్ ఏఓ మోతీలాల్

కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి : డీఎస్ఓ వెంకటేశ్వర్లు

గుర్రంపోడ్,డిసెంబర్ 19: కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం మండలంలోని చామలేడు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీఓ మంజుల, సివిల్ సప్లయ్ గిర్దావర్ రావుల సైదులుగౌడ్, సెంటర్ ఇన్‌చార్జి అనిల్, సిబ్బంది ఉన్నారు.

కొరివి కృష్ణస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలి : బీసీ జేఏసీ

మిర్యాలగూడ, డిసెంబర్ 19: కొరివి కృష్ణస్వామి ఆశయ సాధనలో భాగంగా బీసీలు బహుజన రాజ్యాన్ని సాధించుకోవాలని బీసీ జేఏసీ నాయకులు దాసరాజు జయరాజు, చేగొండి మురళీయాదవ్, దళిత సంఘాల నాయకులు డాక్టర్ రాజు పిలుపునిచ్చారు. గురువారం కృష్ణస్వామి వర్ధంతి సందర్భంగా జ్యోతిరావుపూలే భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈశ్వరచారి, రాములు, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ టీచర్ల ఆందోళన

రామగిరి, డిసెంబర్ 19: తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు గురువారం డీఈఓ భిక్షపతి, డీఐఓ దస్రూ నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీఎంపీఏ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోడల స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

నల్లగొండ రూరల్, డిసెంబర్ 19: సీఎం కప్ పోటీల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో, అథ్లెటిక్స్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆర్డీఓ అశోక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ నర్సిరెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఇందిర, విమల, అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి శంభులింగం, తైక్వాండో కోచ్‌లు యూనుస్, ఏకస్వామి, రమేశ్, ప్రణీత్, పీఈటీలు పాల్గొన్నారు.